


# అందమైన కారు

పదిహేను వేల రూపాయలు అందించాడు వెంకటేశ్వర్లు రుతుపవన్‌కి.

ఇద్దరూ కరచాలనం చేశారు.

"జాగ్రత్తగా చూసుకోండి. గత ఆరేళ్ళుగా ఈ కారుని సింగిల్ హేండెడ్‌గా నడుపుతున్నాను".

హెరాల్డ్ కారు తాళం చెవుల గుత్తి వెంకటేశ్వర్లకి అందించి చెప్పాడు రుతుపవన్. రుతుపవన్ మనసులో కొద్దిగా వెలితిఫీలయ్యాడు తన కారు వెంకటేశ్వర్లకి అమ్మేయడంతో.

ఆ చిన్న తెల్లరంగు కారు సెంటిమెంటల్‌గా ఎంతో విలువైంది రుతుపవన్‌కి. అందులో ఎన్నో అందమైన అనుభవాలు, అనుభూతులు మొట్టమొదటిసారిగా, కారు యజమానిగా తను ఫీలయిన సంతృప్తి అదేనిచ్చింది. పద్మిని ప్రియదర్శిని ఇంకా ఖరీదైన, ఇంకా సౌకర్యమైన కారే అయినా, మొదటిది ఎప్పుడూ మొదటిదే.

అరనిముషం కూడా కాలేదు రుతుపవన్ మళ్ళీ మామూలు మనిషయిపోయ్యాడు. సెంటిమెంటలిస్ట్ కాదతను. ప్రాక్టికల్‌గా ఆలోచించే రచయిత.

వెంకటేశ్వర్లు వారం రోజుల్లో డ్రయివింగ్ నేర్చుకుని కారుని తనే స్వయంగా నడపసాగాడు. నిజానికి అతని పర్సనాలిటీకి ఆకారు ఎబ్బెట్టుగా వుంటుంది. ఉన్నంతలో తృప్తిపడాలి.

ఆకారు కొన్న మూడోరోజు మొదటిసారిగా ఆ అనుభవం ఎదురైంది వెంకటేశ్వర్లుకి.

ఉదయం సికింద్రాబాద్ స్టేషన్ బయట కారు పార్క్ చేసి, తన భార్యని కృష్ణాఎక్స్‌ప్రెస్ ఎక్కించి బయటకి వచ్చాడు. కారులో కూర్చుని ఉంది ఓ అమ్మాయి. పాతికలోపే వయసు.

"నేనొస్తున్నానని ఉత్తరం కూడా రాయకుండా ఎలా తెలుసు!"

వెంకటేశ్వర్లు తొంగి లోపలికి చూసాక ఆ అమ్మాయి తెల్లబోయింది. వెంటనే కారుదిగి నంబర్ చూసి అడిగింది.

"పవన్ రాలేదా?"

"ఆయనకారు నేకొన్నాను".

"ఓ సారీ. అవును అమధ్య ఫియట్ బుక్ చేసానని చెప్పాడు".

నాలుగు రోజుల తర్వాత కారు బషీర్‌బాగ్‌లో ట్రాఫిక్ లైట్స్ దగ్గర ఆగితే ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి చటుక్కున తలుపు తెరచి పక్కన కూర్చుంది.

"ఓ కే వద్దా. ఫోన్ చేయటం లేదు..."

వెంకటేశ్వర్లని చూసి బిత్తరపోయి ఆగిపోయింది.

"ఓ కే.నా?" అడిగాడు వెంకటేశ్వర్లు

"రుతు ఏడీ?"

"ఆయన నాకు అమ్మారు దీన్ని."

"అలాగా. సారీ తెలీదు".

మూడో అనుభవం అరగంట తర్వాతే జరిగింది.

హేవ్‌మోర్ ముందు కారాపి లోపలికెళ్ళి 'హేవ్‌మోర్ స్పెషల్' తిని బయటకివచ్చి కారులో కూర్చున్నాడు.

క్రీనీడలో తన పక్కసీట్లో ఓ అమ్మాయి కూర్చునుండని గ్రహించేలోగా ఆమె తన చేతులని వెంకటేశ్వర్లు మెడచుట్టూ వేసి అతని పెదవులని ముద్దు పెట్టుకుంది— ఐస్‌క్రీం తిన్నా ఇంకా తియ్యగా.

"ఎవరు మీరు?"

వెంకటేశ్వర్లు కంఠం విని చటుక్కున దూరంగా జరిగింది— భయంగా.

"అలాగా. నాకు తెలీదు ఆయన తన కారు అమ్మేసినట్లు" చెప్పింది. కొన్ని క్షణాలు అతను చెప్పింది విని.

"మీరెవరు?" అడిగాడు వెంకటేశ్వర్లు ఆ అందమైన అమ్మాయిని చూస్తూ.

"హోమ్‌సైన్స్ కాలేజీలో స్టూడెంట్‌ని".

"ఆయన మీ స్నేహితుడా?"

"అవును ప్లస్ అభిమాన రచయిత ముఖ్యంగా".

వెంకటేశ్వర్లు మర్నాడు రుతుపవన్ నవల సీరియల్‌గా ప్రచురించే వారపత్రికకి ఓ ప్రకటన రాసి తీసుకెళ్ళాడు. రుతుపవన్ కారు తాను కొనుక్కున్నానని, హైదరాబాద్‌లోని అతని అభిమానులు గ్రహించవలసిందని వుంది అందులో.

వెంకటేశ్వర్లు ఇబ్బంది గ్రహించిన ఎడిటర్ ఆ ప్రకటనని వెంటనే వేస్తానని హామీ ఇచ్చాడు.

"అహహ సరిగ్గా ఎనిమిది వారాల తర్వాతే వేయండి అప్పటిదాకా మా ఆవిడ పుట్టింటినించి రాదు" కంగారుగా చెప్పాడు వెంకటేశ్వర్లు.

*

